ప్రజాశక్తి
శనివారం 05 ఏప్రిల్ 2025
5
కర్నూలు





సదస్సులో మాట్లాడుతున్న ఎఐకెఎస్ జాతీయ కార్యదర్శి రావుల వెంకయ్య

రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలి

రైతు పొలంలో విత్తనం విత్తితేనే దేశ భవిష్యత్ ఉంటుందని, కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేఖంగా తీసుకు వచ్చిన నల్లచట్టాలను వెంటనే రద్దుచేయాలని, రైతు పండించిన పంటకు కనీస మద్దతు ధర కల్పించాలని కేరళ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పి.ప్రసాద్‌తో పాటు పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తపరిచారు. మద్రాసులో నిర్వహించే ఎఐకెఎస్ జాతీయ మహాసభల నేపథ్యంలో శుక్రవారం కర్నూలు శ్రీలక్ష్మీ నరసింహకళ్యాణ మండపంలో ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించారు.

వార్త మెయిన్‌లో

రేషన్‌కు నగదు బదిలీ..?

- ఇకెవైసితో లబ్ధిదారుల వివరాల సేకరణ
- వివరాలను సేకరిస్తున్న రేషన్ డీలర్లు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రేషన్ కార్డుదారులకు రాబోయే రోజుల్లో నగదు బదిలీ పథకాన్ని అమలు చేసేందుకే ఇకెవైసి విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తెరమీదకి తెచ్చింది. ఇకెవైసి ద్వారా లబ్ధిదారుల వేలిముద్రలను వేసుకునేందుకు రేషన్ షాపులకు తరలి వెళ్తున్నారు. కర్నూలు జిల్లాలో 6,71,086 మంది కార్డుదారులున్నారు. జిల్లాలో దాదాపుగా1233 రేషన్ షాపులు ఉన్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రేషన్ కార్డు లబ్ధిదారుల వివరాలన్నిటిని ఇకెవైసి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కార్డిదారుల వివరాలన్నిటిని చేయిస్తుంది. ఈ ప్రక్రియను రేషన్ డీలర్లకు పౌరసరఫరాల శాఖ అప్పగించింది. ఇకెవైసి ప్రక్రియను గత మార్చి నెల ఆఖరికే పూర్తి చేయాలని భావించినప్పటికీ మరో నెల పాటు ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా రేషన్ కార్డు దార్ల ఇకెవైసి ప్రక్రియను రేషన్ డీలర్లు చేస్తున్నారు.. ఇప్పుడు గత నెల రోజులుగా రేషన్ డీలర్లు ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్ల రేషన్ డీలర్లు కార్డుదారుల నుండి డబ్బులు కూడా వసూలు చేస్తున్నారు. ఇకెవైసిపి



చేయించుకోకపోతే ప్రభుత్వ పథకాలు అందవని డీలర్లు కార్డుదారులను బెదిరిస్తూ అక్రమంగా డబ్బులను వసూలు చేస్తున్నారు.

నగదు బదిలీ పథకం అమలుకు చర్యలు

కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం కారిదారులకు బియ్యం సరఫరా చేస్తుండగా రాబోయే రోజుల్లో దానికి బదులు నగదు బదిలీ పథకాన్ని అమలు చేయాలని ఉద్దేశంతోనే ఈ ప్రక్రియను చర్యలు తీసుకుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కార్డుదారులకు ఇస్తున్న బియ్యానికి నగదును నేరుగా కేంద్ర ప్రభుత్వం నగదు బదిలీ పథకం ద్వారా అందజేసేందుకుగాను దృష్టి సారిస్తుంది. కార్డుదారుల వివరాలన్నిటిని పక్కాగా చేసుకుని వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా నగదు జమ చేసేలా చర్యలు చర్యలు చేపడుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. రాబోయే కాలంలో కార్డుదారులకు ఉచితంగా బియ్యం ఇతర నిత్యవసర సరుకులను అందజేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేతులెత్తేస్తారు.



మాట్లాడుతున్న సిపిఐ కార్యదర్శి రాష్ట్ర రామకృష్ణ

యాక్సిస్ ఒప్పందంతో భారం

యాక్సిస్ ఎనర్జీ ఒప్పందంతో వినియోగదారులపై 25 ఏళ్లలో రూ.97 లక్షల కోట్ల భారం పడుతుందని, విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని తిరస్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూ రావు పేర్కొన్నారు. యాక్సిస్ ఎనర్జీ నుంచి ఎస్‌పిడిసిఎల్ 400 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందానికి సంబంధించి కర్నూలులోని ఎపి విద్యుత్ నియంత్రణ మండలి (ఇఆర్‌సి) కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు.

వార్త మెయిన్‌లో

సెకితో విద్యుత్ ఒప్పందం రద్దు చేయాలి

- యూజర్‌ఛార్జీలు రద్దు చేయాలి - అమెరికాలో నమోదైన కేసుపై ప్రభుత్వం స్పందించదెందుకు
- ఎపిఇఆర్‌ఇసి కార్యాలయం ఎదుట సిపిఐ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాష్ట్రప్రభుత్వం సెకి విద్యుత్ ఒప్పందం, ప్రజలకు భారమైన యూజర్స్ చార్జీలు వెంటనే రద్దుచేయాలని సిపిఐ రాష్ట్రకార్యదర్శి కె. రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం నగర శివారుల్లో ఉన్న ఎపిఇఆర్‌ఇసి కార్యాలయం ఎదుట సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్యతో కలసి ఆందోళన నిర్వహించారు. సిపిఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదానితో రాజస్తాన్ నుండి ఇక్కడకు విద్యుత్ సరఫరా చేయుటకు ఒప్పందం కుదుర్చుకోవడం దారుణమన్నారు. ఈ ఒప్పందం వలన రాష్ట్ర ప్రజలపై 25 సంవత్సరాల్లో రూ.లక్షా 20వేల కోట్ల భారం పడుతుందన్నారు. విద్యుత్ యూనిట్ 25 సంవత్సరాల తరువాత రూ.6.25 పైసలు పడుతుందన్నారు. ఎపిలో సోలార్ విద్యుత్ అవకాశం ఉంటే ఆనాడు ప్రభుత్వం ఆదానితో ఎందుకు ఒప్పందం చేసుకోవాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఈ ఒప్పందం కోసం అదానితో రూ.1750కోట్ల లంచం తీసుకున్నట్లు అమెరికాలో కేసు నమోదు అయిందని, ఆదానికి అమెరికా కోర్టు నోటీసులు కూడా ఇచ్చిందన్నారు. ఎపిలో ఇన్ని వసతులు ఉంటే రాజస్తాన్ నుండి విద్యుత్ తీసుకోవడమేమిటని ప్రశ్నించారు. గుజరాత్ రాష్ట్రం యూనిట్ రూ. 1.99 పై ఇస్తుంటే రాజస్తాన్‌లో యూనిట్ రూ 2.45పై ఎందుకు ఒప్పందం చేసుకోవాల్సి వచ్చిందో చెప్పాలన్నారు. ఇది అతిపెద్దస్కాం అని వెంటనే దీనిని రద్దుచేయాలన్నారు. ఎన్నికల ముందు దీనిపై ఎపి హైకోర్టులో ప్రస్తుత ఆర్థిక మంత్రి పయ్యావులకేశవ్ కేసు వేశారని, అధికారంవచ్చిన తరువాత పట్టించు కోకపోవడం దారుణమన్నారు. సిపిఐ తరుపున మేము కేసు వేశామన్నారు. ఎపిఇఆర్‌సి పరువు కాపాడాలని, వెంటనే సెకి ఒప్పందం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అప్పటి ప్రభుత్వం ఇష్టాను సారంగా వేసిన యూజర్ ఛార్జీలు వేసిందని, తమ ప్రభుత్వం వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, యూజర్స్ చార్జీలు తగ్గిస్తామన్న, సెకి ఒప్పందం వెంటనే రద్దుచేయాలని చంద్రబాబునాయుడు డిమాండ్ చేశారన్నారు. అంతకు ముందు ఎపిఇఆర్‌సి కార్యాలయం ఎదుట ఆందోళన చేసి కార్యాలయంలోకి చొచ్చుకు పోయారు. ఎపిఇఆర్‌సి ఛైర్మెన్ పిబిఆర్ రెడ్డికి సమస్యలు వివరించి వినతిపత్రం అందచేశారు. ఎపి మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షకార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి, నగర కార్యదర్శి భారతి, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, ఎఐటియుసి నగర అధ్యక్షులు వెంకటేష్, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు ఈశ్వర్, క్రిష్ణారెడ్డి, నల్లన్న, రాముడు, కుమార్, మల్లిఖార్జున, రామాంజినేయులు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జిల్లా నాయకులు గిడ్డయ్య, రామకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

వారంలో మెగా డిఎస్‌సి విడుదల చేయాలి

- లేదంటే ఆందోళనకు దిగుతాం - డివైఎఫ్ఐ హెచ్చరిక

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఏప్రిల్ మొదటి వారంలో డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేయగానే మొదటి సంతకం మెగా డిఎస్‌సిపై పెట్టి ఇప్పటికి 9 నెలలు గడిచినా నోటిఫికేషన్ విడుదల చేయకుండా డిఎస్‌సి అభ్యర్థులను మభ్య పెడుతున్నారని విమర్శించారు. టెట్ తరువాత డిఎస్‌సి అన్నారు. ఆ తరువాత ఎస్‌సి వర్గీకరణ పేరు చెప్పి వాయిదా వేసి ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత అన్నారు. ఇప్పుడేమో మొదటి వారం మెగా డిఎస్‌సి అని ఇప్పటికి ముఖ్యమంత్రి స్వయంగా మూడుసార్లు ముచ్చటగా మోసం చేశారని అన్నారు. వెంటనే మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, లేనిపక్షంలో ఏప్రిల్ 8 నుండి ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. 2018 నుండి డిఎస్‌సి నోటిఫికేషన్ లేకపోవడంతో అభ్యర్థులు ఏడేళ్లనుంచి తీవ్రమైన ఆర్థిక మానసిక ఇబ్బందులో ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు రోజుకో మాయ మాటలు చెప్పి గాలిలో మేడలు కట్టడం తప్ప ఇచ్చిన మాట మీద ఉండడం లేదని విమర్శించారు. డిఎస్‌సి అభ్యర్థులంద రూ ఈనెల 8వ నుండి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలో పెద్ద ఎత్తున పాల్గొనాలని, ఈ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు.

కనీస వేతనాలు వెంటనే సవరించాలి

- ఎసిఎల్‌కు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు విజ్ఞప్తి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కనీస వేతనాలను వెంటనే సవరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ గంధం చంద్రుడు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫ్యాక్టరీ యాజమాన్యాలు, ఉద్యోగులు, ట్రేడ్ యూనియన్స్ పాల్గొన్న ఈ సమావేశంలో సిఐటియు తరపున అంజి బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కనీస వేతనాలను సవరించి దాదాపు 15 సంవత్సరాలు కావస్తుందని అన్నారు. కనీస వేతనాల బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ బోర్డు పనిలో లేదని అన్నారు. దాదాపు 50 లక్షల మంది కార్మికులు ఈ బోర్డు కిందకు వస్తారని తెలిపారు. వెంటనే కనీస వేతనాలు సవరించి జీవోను తీసుకురావాలని డిమాండ్ చేశారు. వలస కార్మికుల సమస్య పరిష్కరించాలని, వివిధ రాష్ట్రాల నుంచి వలస కార్మికులు వచ్చే వారి సంఖ్య పెరిగిపోతుందని, కానీ వారికి సంబంధించిన వలస కార్మిక చట్టాలు ఏవి వర్తించడం లేదని అన్నారు. వలస కార్మికులను తీసుకువచ్చిన కాంట్రాక్టర్ జిల్లా కేంద్రంలో లేబర్ కార్యాలయం దగ్గర రిజిస్ట్రేషన్ చేయాల్సిన అవసరం ఉందని, అటువంటివి ఏమి జరగడం లేదని అన్నారు. వలస కార్మిక చట్టాలు అమలు అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రీన్‌కో లాంటి కంపెనీలలో సుదూర ప్రాంతాల నుంచి బీహార్, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాల నుండి వచ్చి పని చేస్తున్నారని, వారికి ప్రమాదాలు జరిగినప్పుడు పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. కనీస వేతన చట్టాన్ని కూడా ఎక్కడ వర్తించడం లేదన్నారు. ఆర్‌టిసి లాంటి సంస్థలలో కూడా కనీస వేతనాలు అమలు చేయడం లేదని, అమలు చేయాలని అడిగిన వారిని వెంటనే ఉద్యోగం నుంచి తీసివేస్తున్నారని అన్నారు. జిల్లా అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు ఈవిషయంపై సమీక్షించాలన్నారు. కర్నూలులో ఇఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరారు. ఇఎస్ఐ ఆసుపత్రికి స్థలం కేటాయించినట్లు వార్తలు వచ్చాయని, దాని నిర్మాణానికి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డు, బిల్డింగ్ కార్మికులకు క్లెయిములు పరిష్కరించడానికి తగిన కృషి చేయాలని కోరారు. కార్బైడ్ ఫ్యాక్టరీలో కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలకు తగిన పరిష్కార చర్యలు తీసుకోవాలని కోరారు. ఫ్యాక్టరీని నడిపించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్బైడ్ ఫ్యాక్టరీ కార్మికులు కూడా ఈ సమావేశానికి హాజరై తమ ఆవేదనను వ్యక్తం పరిచారు. కార్బైడ్ ఫ్యాక్టరీ యూనియన్(సిఐటియు) కార్యదర్శి ఆదిశేషన్న మాట్లాడుతూ ఫ్యాక్టరీ కార్మికులకు పిఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తామని తీసుకున్న యాజమాన్యం ఫ్యాక్టరీని నడిపించే దానికి తగిన ప్రయత్నం చేయడం లేదని తెలిపారు. ఫ్యాక్టరీలో ఉన్న స్క్రాప్ అంతా తొలగించే ప్రయత్నం చేస్తున్నారని, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని, ఫ్యాక్టరీని నడిపించడానికి తగిన కృషి చేయాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ ,సిఐటియు నగర కార్యదర్శి మహమ్మద్ రఫీ, ,కార్బైడ్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంజిబాబు



ఐటిసి కంపెనీ వాళ్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

పొగాకును కొనుగోలు చేయాలి

ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పొగాకు పంటలను రైతులకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే గౌరుచరితరెడ్డి ఐటిసి కంపెనీ ప్రతినిధులను కోరారు. శుక్రవారం ఓర్వకల్లు మండల కేంద్రంలోని ఐటిసి కంపెనీ పొగాకు కేంద్రాన్ని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి సందర్శించారు. పొగాకును గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలన్నారు. పొగాకు రైతులు నుండి పంటను కొనుగోలు చేయడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. ఇకనుండి కంపెనీ యాజమాన్యం రైతులు తీసుకువస్తున్న పొగాకు పంటను వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. అలా చేయని పక్షంలో తీవ్రంగా పరిగణిస్తానని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంటా టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి ఇతర నాయకులు ఉన్నారు.

సిల్వర్ సెట్ 2025 నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు నిర్వహించే అర్హత పరీక్ష సిల్వర్ సెట్ 2025 నోటిఫికేషన్‌ను క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపల్ వివిఎస్ కుమార్, సెట్ కన్వీనర్ డాక్టర్ మహమ్మద్ వాహిద్‌లు శుక్రవారం విడుదల చేశారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఛాంబర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రిజిస్ట్రార్ మాట్లాడుతూ కర్నూలులోని సిల్వర్ జూబ్లీ కో ఎడ్యుకేషన్ ప్రభుత్వ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల 2025 విద్యా సంవత్సరానికి వివిధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు సిల్వర్ సెట్ 2025 నోటిఫికేషన్ ను విడుదల చేసిందన్నారు. ఎపి రీ ఆర్గనైజేషన్ ఆక్ట్ ప్రకారం ఈ విద్యా సంవత్సరం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత బోధన, భోజన, వసతిని ప్రభుత్వమే కల్పిస్తుందని వెల్లడించారు. దరఖాస్తులకు ఏప్రిల్ 6 నుండి 30వ తేదీ దాకా ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తామన్నారు. మే 18న అర్హత పరీక్ష ఏర్పాటు చేశామన్నారు. సిల్వర్ జూబ్లీ కళాశాలలో ప్రవేశం పొందేందుకు 280 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుందన్నారు. బిఎ కోర్సులో 40 సీట్లు, బీకాం జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్ 40 సీట్లు, బిఎస్‌సిలో 120 సీట్లు, బిజడ్‌సిలో 80 సీట్లను సబ్జెక్టుల వారీగా కేటాయించామన్నారు. ఆన్‌లైన్ ద్వారా అర్హత పరీక్షను నిర్వహిస్తారన్నారు. పూర్తి వివరాలకు తమ వర్సిటీ వెబ్‌సైట్‌ను లేదా 9059305168 నెంబరు కు సంప్రదించాలని కోరారు.

క్రైస్తవ సంఘాల శాంతియుత ర్యాలీ

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-మద్దికేర

పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతికి నిరసనగా క్రైస్తవ సంఘాలు శాంతియుత ర్యాలీ నిర్వహించాయి. గురువారం మద్దికేరలో కృపా ప్రార్థనా మందిరం నుండి మెయిన్ బజార్, బస్టాండ్ కూరగాయల మార్కెట్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. సీనియర్ వర్తమానికులు జయన్న మాట్లాడుతూ పాస్టర్ పగడాల ప్రవీణ్ మతి పై క్రైస్తవ సమాజానికి ఎన్నో అనుమానాలకు తావిస్తోందన్నారు. క్రైస్తవం పై ఒక గొంతుక వినిపించి సత్యాన్ని, సమాజంలో పలు లోపాలను ఎత్తి చూపిస్తూ మత మహమ్మారిని రూపుమాపాలని గొంతు ఎత్తారన్నారు. ప్రస్తుతం సమాజంలో చోటు చేసుకుంటున్న దురాచారాలను దుశ్చర్యాలను ఆయన ఖండించారన్నారు. ఆయన మతి క్రైస్తవ సమాజాన్ని దుఃఖంలోకి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొదట అందరం ప్రమాదం మనకున్న అక్కడ జరిగిన పరిణామాలు ఒంటిపై ఉన్న గాయాలను చూస్తే హత్యగా అనుమానిస్తున్నామన్నారు. కొందరు కల్పితమైన వీడియోలను వైరల్ చేస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అవాస్తవాలను వైరల్ చేస్తున్నారని అన్నారు. వాస్తవాలు వెలుగులోకి తీసుకొచ్చి ప్రభుత్వం క్రైస్తవ సేవకుడికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కొందరు అల్లరి ముకలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి క్రైస్తవులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటన పట్ల సీఎం చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హోమ్ మినిస్టర్ అనిత న్యాయ విచారణ చేపట్టాలని కోరారు. త్వరలోనే శాంతియుత ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నద్ధం అవుతున్నామన్నారు. తాము మౌనంగా ఉన్నామంటే చేతకాక కాదని, శాంతి యుతంగానే పోరాటం చేసి న్యాయం పొందడం అన్నది గ్రహించాలన్నారు. ఈ ఘటన పట్ల నిర్లక్ష్యం వీడి పోలీస్ దర్యాప్తు ముమ్మరం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, యేసురత్నం, ప్రతాప్, ప్రసాద్, రవికుమార్, ఆనందరాజు ఇజ్రాయిల్, ఆనందు, రాజేష్ రాజశేఖర్, దయాకర్, విశ్వాసులు జయరాజు ఆనంద్ కుమార్ యోహాను ప్రతాప్ లక్ష్మన్న పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.



మద్దికేరలో ప్రదర్శన చేస్తున్న క్రైస్తవ సంఘాలు

జిల్లా జైలును తనిఖీ చేసిన న్యాయమూర్తి

ప్రజాశక్తి- కర్నూలు లీగల్

జిల్లా న్యాయ సేవాది కార సంస్థ, కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి కర్నూలు పురుషుల కేంద్ర కారాగారం, మహిళ కారాగారాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి జైలు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేసి జైలు ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్ గురించి వివరించారు. ఇందులో ఒక అడ్వకేట్, ఒక ప్యారా లీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయాలు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేయాలని కోరారు. ఖైదీలకు ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. 70 ఏళ్ళు వయస్సు పై బడిన ఖైదీలకు, అనారోగ్యంతో బాధ పడే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. త్వరగా బెయిల్ మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. వారిని ఖైధిలకు అందించే ఆహారాన్ని, రేషన్‌ను వారి ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఖైదీలను కోర్టు వాయిదాలకు కచ్చితంగా హాజరు చెయ్యాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కర్నూలు వారిని సంప్రదించవచ్చని అన్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించామన్నారు. కొందరు ఖైదీలు బెయిల్ మంజురైనా జామీను దారులు లేక జైలులో ఉన్నామని జడ్జికి తెలుపగ వారి కేసులను విచారించి బెయిల్ మంజూరు కొరకు తగిన చర్యలు తీసుకొంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, లాయర్ శివరాం ఖైదీలు పాల్గొన్నారు.



జిల్లా జైలులో ఆహారాన్ని పరిశీలిస్తున్న జస్టిస్ లీలా వెంకటశేషాద్రి

అధిక ఫీజులు వసూలు చేయకూడదు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

క్లస్టర్ వర్సి టీ పరిధిలో ఇన్‌టె న్షిప్ పేరుతో అధిక ఫీజులను వసూలు చేయరాదని ఎస్‌ఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు అబూ బకర్, సాయి ఉదయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు వారు మాట్లాడుతూ క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని కళాశాల లోని మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఇన్‌టెనిషిప్ పేరుతో అధిక ఫీజులను సీజలను వసూలు చేయడం తగదన్నారు. ఇప్పటికైనా వర్సిటీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని అధిక ఫీజులను వసూలు చేయకుండా చూడాలన్నారు. సమావేశంలో నగర సహాయ కార్యదర్శి పృథ్వి, నగర కమిటీ సభ్యులు హరి, మురళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు

సిసి రోడ్ల నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి-సి బెళగల్



మండలంలోని కొండాపురం, యనగండ్ల, సి.బెళగల్ గ్రామాల్లో నూతనంగా వేసిన సిసి రోడ్ల నాణ్యతను నాణ్యత పర్యవేక్షణ డిప్యూటీ ఇంజనీర్ రవీంద్ర రెడ్డి , ఎఇ విజయభాస్కర్ సమక్షంలో తనిఖీ చేశారు. ఇక్కడే ప్రజలకు అవసరమైన సిసి రోడ్లు పదిలంగా ఉండాలని అందుకు అధికారుల సలహాలతో నాణ్యతగా చేపట్టాలని గుత్తేదారులకు వారు సూచించారు. గుత్తేదారులకు సకాలంలో బిల్లులు అందించాలని వారి వెంట వచ్చిన మండల పిఆర్ఎఇ వెంకటప్రకాష్‌ను కోరారు.

నేడు గుండ్రవులలో ఉరుసు మహోత్సవం : మండలంలోని గుండ్రేవులలో బడేసాఖాద్రి ఉరుసు మహోత్సవం జరగనున్నట్లు గ్రామ పెద్దలు, దర్గా నిర్వాహకులు పేర్కొన్నారు. శుక్రవారం గంధం సంబరంగా జరిగిందని, నేడు గంధం, రేపు కిస్తీ ఉత్సవాలలో పాల్గొనాలని పేర్కొన్నారు.



కేరళ మంత్రికి జెసి స్వాగతం


ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేరళ వ్యవసాయ శాఖ మంత్రి పి.ప్రసాద్‌ను శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో బస చేసిన మంత్రి పి ప్రసాద్ ను జాయింట్ కలెక్టర్ తో పాటు వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి తదితరులు పుష్ప గుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు.

అసత్య ప్రచారం మానుకోవాలి

- ముస్లింలను మోసగించిన రాష్ట్ర పభుత్వం
- వక్స్ బిల్లు పై మాట మార్చిన చంద్రబాబు నాయుడు
- మాజీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైసిపిపై చేస్తున్న అసత్య ప్రచారాలను మానుకోవాలని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఎ .హాఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వక్స్ బోర్డ్ బిల్లు జెపిసిలో వైసిపి రాజ్యసభ సభ్యులు వ్యతిరేకిస్తూ ఓటు వేశారన్నారు. అందుకు అనుగుణంగా పార్టీ పార్లమెంటరీ సభ్యులకు ఆదేశించిన పత్రాన్ని ఆయన మీడియా ముందు ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ... మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముస్లింలకు ఎల్లవేళలా అండగా ఉంటారని హామీ ఇచ్చారని, అందుకు నిదర్శనంగా పార్లమెంటులో వక్స్‌బోర్డు బిల్లును వ్యతిరేకిస్తూ తమ పార్టీ పార్లమెంటు సభ్యులు ఏడుగురు ఓటు వేశారన్నారు. ఈ ఓటింగులో బిల్లుకు వ్యతిరేకంగా అనేకమంది ఓటు వేశారని, అయినప్పటికీ బిజెపి కూటమి ప్రభుత్వం ఒంటెత్తు పోకడతో వ్యవహరించిందన్నారు. చంద్రబాబు నాయుడు ముస్లింలకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కారన్నారు. బిల్లుకు టిడిపి మద్దతును తెలిపి ముస్లింలను మోసగించిందన్నారు. టిడిపిని ముస్లిం సమాజం క్షమించదన్నారు. పైగా వైసిపిని అసత్య ప్రచారాలతో సోషల్ మీడియాలో తన అనుకూల మీడియాలో తప్పుడుప్రచారానికి తెగబడుతుందన్నారు. ప్రజలు దీన్ని గమనిస్తున్నారని, తగిన గుణపాటాన్ని భవిష్యత్తులో ప్రజలే చెబుతారని అన్నారు.


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

డ్రాపౌట్ విద్యార్థులపై ప్రత్యేక యాక్షన్ ప్లాన్

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి-ఆదోని

డివిజన్‌లో స్కూల్ డ్రాపౌట్ అవుతున్న విద్యార్థులను బడిలోకి తీసుకురావడానికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. శుక్రవారం సబ్ కలెక్టర్ వారి కార్యాలయంలో విద్యా, సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ వెల్ఫేర్, కెజిబివి హాస్టల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డివిజన్‌లో ఎక్కువగా డ్రాపౌట్ అవుతున్న విద్యార్థులను గుర్తించి వారిని తిరిగి స్కూల్‌లో చేర్పించే విధంగా ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలన్నారు. ముగిసిన పదో తరగతి పరీక్షలకు వివిధ కారణాల వల్ల విద్యార్థులు గైర్హాజరయ్యారని, వారిని గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డివిజన్‌లో ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టళ్లను ఎంఇఒలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. సంక్షేమ హాస్టల్‌లో, విద్యాసంస్థల వద్ద మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. డిఎల్‌పిఒ నూర్జహాన్, డిప్యూటీ డిఇఒ వెంకట రమణా రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి రాజు, కుళాయప్ప పాల్గొన్నారు.

'ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలి'

ప్రజాశక్తి - కౌతాళం


సంఘీభావం తెలుపుతున్న కార్మికులు

కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని ఎమ్మిగనూరు డివిజన్ ఇరిగేషన్ వర్క్ చార్జ్డ్ ఇరిగేషన్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సుధాకర్, రామకృష్ణ నాయుడు, సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మిగనూరులోని ఇరిగేషన్ కార్యాలయ ఆవరణలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, అలాగే కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరారు. ఉద్యోగ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై దశలవారీగా ఉద్యమ కార్యాచరణ రూపొందించడానికి, కార్మికుల హక్కుల సాధనకు ఈనెల 12, 13న కర్నూలులో సిఐటియు వర్క్‌షాపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వర్క్ షాపులో ప్రభుత్వ రంగ సంస్థల్లో, ప్రయివేట్ రంగాల్లోని ఉద్యోగులు, కార్మికులు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు, అసంఘటితరంగ కార్మికులు పాల్గొనాలని కోరారు. సిఐటియు నాయకులు పి.రాజు, వర్క్ చార్జ్డ్ నాయకులు శీను, రమేష్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల దోపిడీని అరికట్టాలి : ఐద్వా

ప్రజాశక్తి- ఆలూరు

రేషన్ దుకాణం ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న నిత్యావసర సరుకుల్లో డీలర్లు దోపిడీకి పాల్పడుతున్నారని, ఈ దోపిడీని అరికట్టాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి షేకున్ బీ కోరారు. శుక్రవారం జ్యోతిబసు భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టణంలోని మఠ్రిస్వామి మఠం దగ్గర 132వ డీలర్ షాపులో లబ్ధిదారులకు కేటాయించిన రేషన్ బియ్యంలో ప్రతి కార్డుకూ 5 కిలోల బియ్యం తగ్గించి వేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఈకేవైసీ ఈనెల 30 వరకు పొడిగించినా, ఈకేవైసీ తంబ్ వేసిన వారికి కూడా 5 కిలోల బియ్యాన్ని కోత వేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు బియ్యం అందించినా, రేషన్ డీలర్ మాత్రం ప్రభుత్వం ఇవ్వలేదని చెబుతున్నారని తెలిపారు. ఆన్‌లైన్‌లో మొత్తం ఇచ్చినట్టు చూపిస్తోందని, డీలర్ మాత్రం 5 కిలోలను తక్కువగా ఇస్తున్నారని చెప్పారు. తుకానికేమో మొత్తం తూకం వేస్తారని, తర్వాత 5 కిలోలను వెనక్కి తీసుకుంటున్నారని తెలిపారు. ఇంత బహిరంగంగా దోపిడీ చేస్తుంటే అధికారులు, ప్రభుత్వం మాత్రం నిద్రపోతూ అవినీతిని ప్రోత్సహిస్తోందని విమర్శించారు. వెంటనే అవినీతికి పాల్పడున్న రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకుని, ప్రతి లబ్ధిదారునికీ న్యాయం చేయాలన్నారు. లేకపోతే మహిళలందరినీ సమీకరించి తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న షేకున్ బీ

అభివృద్ధికి ఆమడదూరం..!

- పనులు చేపట్టేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- అభివృద్ధికి నోచని శివారు ప్రాంతాలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో అభివృద్ధి కుంటుపడింది. అధికారంలోకి వస్తే శివారు ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సదుపాయం కల్పిస్తామని కూటమి నాయకులు హామీఇచ్చారు. అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నప్పటికీ పనులు చేపట్టకపోవడంతో శివారు ప్రాంతాల వాసులు ఇబ్బందులు పడుతున్నారు.


సమస్యలను చూపుతున్న సిపిఎం నాయకులు, స్థానికులు

రోడ్లు లేక మైనార్టీ కాలనీవాసుల ఇబ్బందులు

పట్టణ శివారులోని మైనార్టీ కాలనీలో సుమారు 100 దినసరి కూలీ ముస్లిం కుటుంబాలు నివసిస్తున్నాయి. కాలనీ ఏర్పడి 20 ఏళ్లు గడిచినా సిమెంటు రోడ్లు, డ్రెయినేజీ సదుపాయం లేదు. పట్టణానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో మైనార్టీ కాలనీ ఉంది. టిజిఎల్ కాలనీ, ఈద్గా మీదుగా కాలనీకి వెళ్లాల్సి ఉంటుంది. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా గుంతల్లో ఆగిన నీటిలో నడవాల్సిన పరిస్థితి ఉంది. కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ లేకపోవడంతో మురుగునీరు ఇళ్ల మధ్యనే నిలుస్తోందని చెబుతున్నారు. కాలనీలో తాగునీటి సదుపాయం అంతంత మాత్రంగానే ఉంది. నీరు సరఫరా అయ్యే పైపులైను లీకేజీ ఏర్పడింది. అందులో మురుగునీరు కలిసి కలుషితమవుతున్నాయి. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారు లేరు. అమరావతి నగర్‌లో చిన్నపాటి వర్షం కురిసినా ఆ ప్రాంతమంతా నల్ల మట్టి ఉండడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పాలకుల దృష్టికి తీసుకెళ్లినా 'అదిగో.. ఇదిగో' అంటూ కాలయాపన చేస్తున్నారు. 25వ వార్డులోని రాజాసాహెబ్ నగర్‌లో సుమారు 100 కుటుంబాలు నివసిస్తున్నాయి. అక్కడ గతేడాది డ్రెయినేజీ నిర్మించినప్పటికీ సిమెంట్ రోడ్లు మరిచిపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా వీధులన్నీ బురదమయమవుతున్నాయి. సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరితే 'అజెండాలో పెట్టాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తామ'ని చెబుతున్నారు. నెలలు గడిచినా పనులు జరగడం లేదు. పట్టణంలో 42 వార్డుల్లో న్యాయం జరిగేలా చూస్తామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ చెబుతున్నారు.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపినా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కింద చేపట్టిన పనులు పూర్తయినా బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ప్రస్తుతం 42 వార్డుల్లో అవసరం మేరకు సిమెంటు రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 54 పనులకు సుమారు రూ.4 కోట్లు మంజూరయినట్లు అధికారులు చెబుతున్నారు. టెండర్ల ప్రక్రియ ఈనెల 20తో ముగుస్తుందని పేర్కొంటున్నారు. 'పనులు చేపట్టండి. మేము అండగా ఉన్నామ'ని అధికారులు చెబుతున్నా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. మున్సిపాలిటీలో ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉందని, నిధులు రావని పనులు చేసేందుకు సాహసించని పరిస్థితి ఉంది. ఈసారైనా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు మొదలు పెడతారో లేదో వేచి చూడాలి.

అభివృద్ధి పనులకు శ్రీకారం

- ఇంతియాజ్, మున్సిపల్ ఇంజినీర్, ఆదోని



మున్సిపాలిటీలోని ఆయా వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు మున్సిపల్ కౌన్సిల్ మంజూరు చేసిన సుమారు రూ.4 కోట్లతో అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచాం. పట్టణంలోని ఆయా వార్డుల్లో సిసి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు కేటాయించాం. రూ.4 కోట్లతో 54 పనులు చేపడుతున్నాం. బసాపురం ఎస్ఎస్ ట్యాంకు వద్ద రూ.30 లక్షలతో పనులు చేపడుతున్నాం. గత ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉన్న శ్మశాన వాటికలో మృతదేహాల దహనానికి వినియోగించే పరికరాల ఏర్పాటు కోసం ప్రత్యేకంగా రూ.18 లక్షలతో హిందూ శ్మశానవాటికలో షెడ్డు నిర్మిస్తున్నాం. నిజాముద్దున్, ఆయా వార్డుల్లో మురుగుదొడ్ల సముదాయ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. ఈనెల 20న ఈ పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ ముగుస్తుంది. కాంట్రాక్టర్లు ముందుకు వస్తున్నారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న పనులన్నీ జరిగేలా చర్యలు తీసుకుంటాం.

రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నాం

- ఎగ్బాల్, మైనార్టీ కాలనీ వాసి



చిన్నపాటి వర్షం కురిసినా పరిసరాలన్నీ బురదమయమవుతున్నాయి. వృద్ధులు, మహిళలు, చిన్నారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతూ కింద పడుతున్నారు. రాత్రి వేళ చీకటిగా ఉంటుంది. ఇళ్ల మధ్యనే ముళ్లపొదలు విస్తరించి ఉన్నాయి. విషపురుగులు సంచరిస్తూ ఇళ్లల్లోకి వస్తున్నాయి. ఇక్కడ అందరూ పేదవాళ్లే ఉన్నారు. కాలనీలో సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరినా పట్టించుకునే వారే లేరు. కాలనీలో పర్యటించి పారిశుధ్య పనులు చేపట్టి ముళ్లపొదలు తొలగించాలని కోరినా స్పందన లేదు. అధికారులు స్పందించి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టి కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

గాలి వానతో వరి

- రైతు విలవిల

ప్రజాశక్తి - కౌతాళం

వరి పంట సాగు చేసిన రైతులు గాలి వానకు విలవిల్లాడుతున్నారు. గురువారం రాత్రి కురిసిన గాలివానకు మండలంలో తుంగభద్ర నదీతీరంలో సాగు చేసిన పంట పొలాల్లో వరి పంట నేల వాలింది. చేతికి వచ్చిన పంట నేల వాలడంతో పంట దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. మండలంలోని తుంగభద్ర నదీతీర గ్రామాలైన మేలిగనూరు, నదీచాగి, కుంభాలనూరు, మురళి, గుడికంబాలి, వల్లూరు గ్రామ పరిధిలోని సుమారు 2 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. గాలి వాన దెబ్బకు అనేకమంది రైతుల పంటలు నేల వాడడంతో గింజలు మొలకెత్తి నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు.


నేల వాలిన వరి పంట

తాగునీటి సమస్య రాకుండా చర్యలు : ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - కౌతాళం

ఎమ్మిగూరు నియోజకవర్గంలో ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి, ఆదోని డివిజన్ సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మిగనూరు ప్రభుత్వ అతిథి గృహంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను శాలువాతో మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే సన్మానించారు. ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాల్లో ఉన్న తాగునీరు, రెవెన్యూ సంబంధిత అంశాలపై అధికారులతో కలిసి సమీక్షించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మజ, డిఎల్‌పిఒ నూర్జహాన్, తహశీల్దార్లు శేష ఫణి, శ్రీనివాసులు, కుమార స్వామి, మున్సిపల్ కమిషనర్ గంగి రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై టిడిపిలోకి చేరికలు : బీవీ

కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టిడిపిలోకి వస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం గోనెగండ్ల మండలం వెముగోడు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు, రాష్ట్ర వైష్ణవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకట సాయి నాథ్, ఆయన అనుచరులు 400 మంది వైసిపి నాయకులు, కాంట్రాక్టర్ చిన్న నాటూర్ ఈశ్వర్, ఆయన అనుచరులు దాదాపు 100 మంది ఎమ్మెల్యే డాక్టర్ బీవీ సమక్షంలో టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పార్టీ అభ్యున్నతికి, ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బీవీ, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


టిడిపిలో చేరుతున్న వైసిపి నాయకులు వెంకట సాయినాథ్


మృతి చెందిన పొట్టేళ్లు

పిడుగుపాటుతో ఆరు పొట్టేళ్లు మృతి

- రూ.లక్ష నష్టపోయిన నిరుపేద

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని నేమకల్లు పంచాయతీలోని మజరా గ్రామమైన సంగాలలో పిడుగుపాటుకు గురై ఆరు పొట్టేళ్లు మృత్యువాత పడ్డాయి. గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పశువుల పాకలో ఉన్న పొట్టేళ్లు పిడుగుపాటుకు గురై మృత్యువాత పడ్డాయని యజమాని జోలాపురం సుధాకర్ వాపోయారు. సుధాకర్ చిన్న పొట్టేళ్లను తెచ్చి మేపేవారు. తర్వాత అమ్ముకొని జీవనం సాగించేవారు. ఈ జీవాలు మృత్యువాత పడడంతో జీవనం ఎలా అని వాపోయారు. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని, ఉన్నతాధికారులు ఆర్థిక సహాయం అందేలా చూడాలని కోరారు. సమాచారాన్ని రెవెన్యూ సిబ్బందికి అందజేశారు.

విద్యుదాఘాతంతో ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - ఆదోని



పట్టణంలో విద్యుదాఘాతం ప్రమాదంలో సిఎల్ పోల్ టూ పోల్ ఉద్యోగి ఈరన్న మృతి చెందారు. పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన కల్లుపోతుల ఈరన్న విద్యుత్ శాఖలో కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని ఓ హోటల్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయడానికి వెళ్లి ప్రమాదానికి గురై మృతి చెందారు. గుర్తించిన స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

బెల్లం వ్యాపారులపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆదోని

నిబంధనలకు విరుద్ధంగా బెల్లం విక్రయాలు చేసిన ఐదుగురు వ్యాపారులపై కేసు నమోదు చేశామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ సైదుల్ తెలిపారు. శుక్రవారం రణమండల కొండలో 350 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బెల్లం విక్రయం చేసే సమయంలో కొనుగోలు దారుల నుంచి ఆధార్ కార్డు సేకరించాలని తెలిపారు. ఒక్కరికే 5 కిలోలకు మించి అమ్మ రాదని నిబంధన ఉందన్నారు. ఐదుగురు నిబంధనలు పాటించకపోవడంతో తహశీల్దార్ ముందు హాజరు పరిచి బైండోవరు చేశామన్నారు. శుక్రవారం పేటకు చెందిన హరికృష్ణ నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.


ఊటను ధ్వంసం చేస్తున్న సిఐ

బాలిక సంరక్షణపై అవగాహన


ప్రజాశక్తి - గోనెగండ్ల


అవగాహన కల్పిస్తున్న నాగన్న

బాలికల సంరక్షణపై గోనెగండ్లలోని ఎపి మోడల్ మోడల్ పాఠశాల విద్యార్థినులకు ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పోలీసు శక్తి టీం సభ్యులు జిటి.నాగన్న అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ శుక్రవారం తెలిపారు. మహిళలు, బాలికల రక్షణ, బాలికలకు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, ఆత్మ రక్షణపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. శక్తి యాప్‌తో ఆకతాయిల ఆట కట్టించడానికి మహిళలు, చిన్నపిల్లలకు శక్తి టీం ద్వారా సత్వర స్పందనపై వివరించామన్నారు. అలాగే అత్యవసర సమయాల్లో 112 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని వివరించారు. ఉపాధ్యాయులు శ్రీదేవి, హరిత, ఉమా, అనసూయ, రాణి, సౌమ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వైసిపి పరామర్శ

ప్రజాశక్తి - కౌతాళం


నివాళులర్పిస్తున్న నాయకులు

పిడుగుపాటుకు గురై మృతి చెందిన బాలుని కుటుంబాన్ని వైసిపి నాయకులు పరామర్శించారు. బోయ మారెన్న కుమారుడు బోయ రవి (15) గురువారం పొలం పనిలో ఉండగా పిడుగు పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైసిపి ఎమ్మిగనూరు ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక ఆదేశాల మేరకు ఆమె పర్సనల్ అసిస్టెంట్ సందీప్ కుమార్, జిల్లా చేనేత అధ్యక్షులు ఎంకె.శివప్రసాద్, మండల యువ నాయకులు బి.బసిరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. భవిష్యత్తులోనూ ఈ కుటుంబానికి వైసిపి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. వైసిపి కందనాతి నాయకులు బోయ బొడ్డన్న, వెంకటేష్, వీరేష్, మారెన్న, నరసన్న, కేశన్న, శ్రీరాములు, కేశవ పాల్గొన్నారు.

ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి

ప్రజాశక్తి - ఆదోని

బాబు జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బాలస్వామి, రాజనీతి శాస్త్రం విభాగాధిపతి డాక్టర్ ఎం.అయ్యప్ప, ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.రామకృష్ణ, అధ్యాపకులు వెంకటరామిరెడ్డి, గోపాల్ రెడ్డి, ఎల్లప్ప, విరుపాక్షప్ప, నిఖిల్ ఉన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం..!

- ప్రజల కష్టాలు తీర్చిన వైసిపి నాయకులు శివారెడ్డి గౌడ్
- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - నందవరం


నీటి సమస్యకు పరిష్కారం లభించింది. మార్చి 27న ప్రజాశక్తి దినపత్రిక ప్రచురించిన 'పల్లెల్లో నీటి దాహం' కథనానికి అధికారులు, నాయకులు స్పందించారు. సంవత్సరం నుంచి నీటి ఎద్దడితో సతమతమవుతున్న ప్రజల కష్టాలను వైసిపి నాయకులు శివారెడ్డి గౌడ్ తీర్చారు. గత కొన్ని నెలలుగా ఎస్సీ కాలనీ, గ్రామంలో గల 6, 7వ వార్డు ప్రజలు నీటి సరఫరా లేక తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. పైపులైన్ మరమ్మతులు చేపట్టి, ప్రత్యేక పైపులైన్ సదుపాయాల ద్వారా ప్రజలకు నీటిని అందించి సమస్యను పరిష్కరించారు. శుక్రవారం శివారెడ్డి గౌడ్ దగ్గర ఉండి పనులను చేయించారు. వీధిలో తిరుగుతూ ప్రతి కుళాయికీ మరమ్మతులు చేపట్టి వాటికి ఆన్, ఆఫ్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మార్చి 29న ఎస్సీ కాలనీ 14వ వార్డులో గల నీటి సమస్యను పరిష్కరించామని, అదే రోజు 6, 7వ వార్డులో గల నీటి సరఫరా పైపులైన్ మరమ్మతు పనులను ప్రారంభించినట్లు చెప్పారు. ఉగాది, రంజాన్ పండగలు ఉండడం వల్ల కార్మికులు రాకపోవడంతో రెండు రోజులుగా మరమ్మతులను చేపట్టి నీటి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. గ్రామంలో నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని చెప్పారు. భారీ సంపును ఏర్పాటు చేస్తామన్నారు. అక్కడి నుంచి ప్రతి రెండు వార్డులకు అండర్ గ్రౌండ్‌లో ప్రత్యేక లైన్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. అండర్ గ్రౌండ్ పైపులైన్ పనులను ప్రారంభించామని, ఇంటికి కుళాయి కావాల్సిన వారు పంచాయతీ కార్యాలయంలో చలానా కట్టాలని చెప్పారు. నీటి సమస్యను పరిష్కరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. శివారెడ్డి గౌడ్‌కు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కొన్ని నెలలుగా నీటి సమస్యతో ఇబ్బందులను ఎదుర్కొన్నామని, తమ తరపున ప్రజాశక్తి దినపత్రిక నిలబడడం వల్లే సమస్య తీరిందని, కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి రంగేశప్ప, చాంద్ తాత, పంపయ్య, విజ్ఞన్న, తోట రంగముని, వెంకటస్వామి, బసవరాజు పాల్గొన్నారు.


పుష్కలంగా నీరు పారుతున్న కుళాయి

ఎస్ఐ కేశవ్‌కు సన్మానం

ప్రజాశక్తి - నందవరం

నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన కేశవ్‌ను నందవరం శ్రీశక్తి ఆటో యూనియన్ సభ్యులు శుక్రవారం పోలీసు స్టేషన్‌లో శాలువా, పూలమాల వేసి సన్మానించారు. ఎంకప్ప, సురేష్, మరియా గౌడ్, మహేష్, మన్సూర్, వీరేష్ గౌడ్, ఖాజా పాల్గొన్నారు.


ఎస్ఐని సన్మానిస్తున్న యూనియన్ సభ్యులు

ఎస్ఐకి టిడిపి నాయకుల సన్మానం

ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన కేశవ్‌ను హాలహర్వి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. టిడిపి నాయకులు నాగరాజు, జగన్నాథ్ రెడ్డి, దావీదు, ఖాసీం, ఎర్రన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - కౌతాళం

వైసిపి కార్యకర్త కుటుంబానికి రాంపురం రెడ్డి సోదరులు ఆర్థిక సహాయం అందజేశారు. వైసిపి కార్యకర్తల కుటుంబానికి రాంపురం రెడ్డి సోదరులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని మండలంలోని కుంభాలనూరు క్యాంపు నాయకులు అనిల్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. మండలంలోని కుంభాలనూరు క్యాంపు-1 గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త హరిజన ఎంకప్ప తండ్రి హరిజన దేవచరణ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిపారు. విషయం తెలుసుకున్న మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి చికిత్స నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం కుటుంబానికి అందజేశారన్నారు. వైసిపి నాయకులు సిహెచ్.అనిల్ కుమార్, బారికి చిన్న నరసింహులు, బారికి పెద్ద నరసింహులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి దాసరి గోవిందరాజులు

'నీటి వృథాను అరికడదాం'

ప్రజాశక్తి - చిప్పగిరి

తాగునీటి విలువ తెలుసుకొని ప్రతి ఒక్కరూ ఒక్క నీటి బొట్టును కూడా వృథా చేయకుండా మానవాళికి ఉపయోగపడేలా చూసుకోవాలని సర్పంచి దాసరి గోవిందరాజులు, టిడిపి సీనియర్ నాయకులు, మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు తెలిపారు. విద్యార్థులు, ప్రయాణికులు తాగు నీటికి ఇబ్బందులు పడకూడదని చిప్పగిరిలోని బస్టాండ్ దగ్గర సర్పంచి గోవిందరాజులు, పంచాయతీ కార్యదర్శి ప్రమీల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. శుక్రవారం సర్పంచి చేతులమీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా టిడిపి నాయకులు మీనాక్షి నాయుడు హాజరయ్యారు. మాజీ ఎంపిటిసి నరసింహులు, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, ఇఒఆర్‌డి బాలన్న పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హొళగుంద : మండలంలోని గజ్జహల్లి గ్రామానికి చెందిన వడ్డే కాడ సిద్ధ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. సిద్ధ వద్ద ఉన్న 65 కర్ణాటక మద్యం 90 మిల్లీలీటర్ల ఒరిజినల్ ఛాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.


ఘనంగా మన్ను మారెమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో శ్రీమన్ను మారెమ్మ దేవి శిల విగ్రహ ప్రతిష్టాపనను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి గోపూజ నిరీక్షణ, ప్రతిష్ఠంగా హోమం, ప్రాణ ప్రతిష్టాపనం, పంచామృతాభిషేకం, గోపుర, కలశ స్థాపన, కలశాభిషేకం, నైవేద్య సమర్పణ, మహామంగళ హారతి, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భక్తులు పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైసిపి గౌరవాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు, టిడిపి నాయకులు పాండవగల్ అయ్యన్న, తిమ్మప్ప, టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ, కపటి మాజీ సర్పంచి మాధవ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 8.30 గంటలకు శ్రీరేణుక ఎల్లమ్మ దేవి మహత్త్యం బయలు నాటకం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఇస్వి పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

దేవాలయానికి రూ.60 వేల విరాళం

శ్రీమన్ను మారెమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపనకు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాల్మీకి ఆధ్వర్యంలో బిజెపి పెద్దహరివాణం నాయకులు బి.వాల్మీకి రాగప్ప, టి.మల్లికార్జున రెడ్డి, చోటు భాయ్ విరాళం అందించారు. ఈ కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించగా, దేవాలయ నిర్మాణానికి తమ వంతు సహాయంగా రూ.60 వేలు అందజేశారు. బిజెపి నాయకులు జె.మల్లి స్వామి, జి.నాగరాజు, ఎం.రఘురాం, నర్సోజీ రావు, గురురాజ, జెసిబి వలీ, ఎన్.బసవరాజ్ పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి


విరాళం ఇస్తున్న నాయకులు